క్లుప్తంగా

బీఎస్పీలో చేరిక..

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన 75మంది బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ మేరకు.. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అర్జున్ రాజ్, అమీర్, చంద్రశేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నారాయణపేట రూరల్: ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ధ్రువపేటలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అమ్మాయిలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని పలు దైవభక్తి, సాంప్రదాయ నృత్యాలు చేశారు. పోటాపోటీగా డ్యాన్సులు చేసిన చిన్నారులకు సమాజం పెద్దలు బహుమతులు అందించారు.

బీఎస్పీకి అవకాశం కల్పించండి



ధన్వాడ: బీఎస్పీకి ఒకసారి అవకాశం కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి వెంకటేష్ ముదిరాజ్ ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని ఏనుగు గుర్తుకు ఓటు వేసి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ మెనిఫెస్టో ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో అరవింద్, రాజు, రవికుమార్, మహిమూద్, బాలరాజు, తిరుమలేష్, కురుమూర్తి, ఆనంద్, కృష్ణ, భాస్కర్, ఆంజనేయులు, అజయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బాలప్పకు నివాళి

నారాయణపేట రూరల్: మండలంలోని భైరంకొండకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త సుతారి పెద్దబాలప్ప ఆదివారం మృతి చెందారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాయాదవ్, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్యతో పాటు పలువురు నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. బాలప్ప మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అభిప్రాయపడ్డారు.

ముగిసిన ఉత్సవాలు



దామరగిద్ద: మండల కేంద్రంలోని భవాని మాతా ఆలయంలో నవరాత్రి ముగింపు ఉత్సవాలను ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

మక్తల్: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీ ఎంపికలు ఆదివారం పట్టణంలో నిర్వహించారు. కరాటే పోటీల్లో ఎంపికైన విద్యార్థులను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, డీవైఎస్ఓ వెంకటేష్ శెట్టి అభినందించారు. కార్యక్రమంలో కరాటే ఫౌండర్ ఎండీ సలాం, పీఈటీలు అంబ్రేష్, సాయినాథ్, ఎండీ సలీం, శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వారబందీ ఎత్తేసి.. నీళ్లివ్వండి

ఆత్మకూర్: పంటలు కోతల సమయంలో సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు ఇవ్వాలని డీ–6 ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఆదివారం తూంపల్లి, వీరరాఘవపురం, రేచింతల రైతులు డీ–6 కాలువలో పేరుకుపోయిన రాళ్లు, రప్పలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక పంటలు ఎండుతుంటే వారబంధి పేరిట నీటిసరఫరాను నిలిపివేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాల్వలకు గండ్లు పడి నీరు వృథాగా పోతుందని, గతంలో కూడా చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. పీజేపీ అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారిందన్నారు. డీ–6 కాల్వ పరిధిలోని జూరాల, గుంటిపల్లి, ఆరేపల్లి, రేచింతలలో 10వేల ఎకరాల్లో పంటలు ప్రశ్నార్థకంగా మారాయని తెలిపారు. వారబంధిని ఎత్తేసి వెంటనే సాగునీరు విడుదలచేసి పంటలను కాపాడలని రైతులు యాదయ్య, కృష్ణయ్య, రవి, నరేష్ కోరారు.

వరికోతలు షురూ..

- కూలీల కొరతతో వరికోత మిషన్లను ఆశ్రయిస్తున్న రైతులు
- ఇదే అదనుగా రేటు పెంచుతున్న యంత్రాల యజమానులు
- ఇబ్బందుల్లో రైతులు
- ప్రారంభంకాని వరి కొనుగోలు కేంద్రాలు



మాగనూర్ సమీపంలో వరికోత మిషన్లతో వరిచేను కోస్తున్న ఓ రైతు (ఫైల్)

మాగనూర్: మండల పరిధిలోని వానాకాలం వరి చేల కోతలు షురూ అయ్యాయి. సీజన్ ఆరంభంలో నాట్లు వేసిన వరిచేలు కోతకు వచ్చాయి. యంత్రాల సాయంతో వరిచేలు కోయిస్తూ రైతులు కూలీల కొరతను అధిగమిస్తున్నారు. మండలంలో యాసంగి సీజన్‌లో సుమారు 9వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాల్వలో సీజన్ ఆరంభం నుంచి చెరువులతోపాటు, కుంటల్లో నీరు ఉండడంతో భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లుపోశాయి. దీంతో యాసంగి సీజన్‌లో రైతులు వరిసాగు అధికంగా చేశారు. కాగా వానాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో వాతావారణంలో వచ్చిన మార్పుల కారణంగా వరిచేలకు తెగుళ్ల బెడద అధికంగా ఉండటంతో దిగుబడి తగ్గేలా ఉందని మండలంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు..

ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు వరిచేలను కోసి కుప్పలుగా పోశారు. ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. మరోవైపు రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేప్రయత్నం చేస్తున్న రైతులో మాత్రం ఆందోళన కలిగిస్తూనే ఉంది.

రేటు పెంచుతున్న యంత్రాల యజమానులు..

కూలీల కొరత అధిగమించేందుకు రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరం.. వరి కోత యంత్రాల యజమానులకు, దళారులకు అనుకూలంగా మారుతోంది. ఇష్టానుసారంగా రేటును పెంచుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ యంత్రాల రేటుపై నియంత్రణ పెట్టాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..



వరిసాగు చేసిన ప్రభుత్వం కొనేందుకు ముందుకు రాకపోవడం మరోవైపు కూలీలు దొరకకపోవడంతో వరికోత మిషన్ల యాజమానులు రేట్లు పెంచుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులు చొరవ చూపి రేట్లను అదుపు చేయాలి.

– వెంకట్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి

సబ్సిడీపై యంత్రాలను అందించాలి..



గతంలో వ్యవసాయదారులకు సబ్సిడీలపై వరికోత మిషన్లు అందించేవారు. ప్రస్తుతం అది లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులు స్పందించి మళ్లీ వరికోత యంత్రాలను సబ్సిడీపై రైతులకు అందజేయాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, నేరడగం

త్వరలోనే ఏర్పాటు చేస్తాం..



వరికొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో సమావేశాలు నిర్వహించారు. వాటికి సంబంధించిన విధివిధానాలు కూడా రావడం జరిగింది. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ మాగనూర్

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



ఎలిగండ్లలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ధన్వాడలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

నారాయణపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని మరోసారి ఓటువేసి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ మొనటి జ్యోతి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, హంసరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ఎలిగండ్ల, అప్పంపల్లి, మరికల్, మాధావరం తదితర గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇంటింటి ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ప్రజలకు వారు సంకేతాలు ఇచ్చారు. కార్యక్రమంలో మోహన్, ప్రకాష్‌శెట్టి, ఉస్సేన్, నర్సింహారెడ్డి, హన్మంతు, రామస్వామి, బసంత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మరోసారి ఓటువేసి గెలిపించాలని సర్పంచ్ అమరేందర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని ప్రచారాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకోసం రైతబంధు, రైతుబీమా అందించడంతోపాటు ఇప్పుడు అధికారంలోకి వస్తే సబ్సిడీపై విత్తనాలు మందులను అందజేస్తుందన్నారు. అలాగే కిష్టాపూర్‌లో నిరంతరం ప్రజాసేవ కోసం పనిచేసే ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ప్రధన కార్యదర్శి చంద్రశేఖర్, మల్లేష్‌గౌడ్ శ్రీనివాస్‌గౌడ్, సురి, సత్యనారాయణ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గండిబాల్‌రాజు, యువజనం సంఘం అధ్యక్షుడు సునిల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీ కడుపయ్య, బాలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఊట్కూరు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ గోకరి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. మక్తల్, నారాయణపేటకు వెళ్లే ద్విచక్రవాహనాలతో పాటు జీపులు, కార్లు తనిఖీ చేశారు. అనంతరం సమస్తాపురం చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విజయ్, రాజునర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



నారాయణపేట రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పట్టణంలోని అంబాభవాని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని కలిసిన వాకిటి

మక్తల్: మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డిని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆదివారం మర్యాద పూర్వకంగా హైదరాబాద్ కలిశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆయనను సత్కరించారు. అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.



కేంద్ర పథకాలతో అందరికీ న్యాయం



బీజేపీలో చేరిన మొట్లంపల్లి గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, రేచింతల శ్రీను అన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మొట్లంపల్లికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీ పాలనపై ఫిదా అవుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిరపాలన సాధ్యమని, ప్రతి ఒక్కరికి న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, ఎల్లన్న, రాజు ఉన్నారు.

మూతపడ్డ తాగునీటి శుద్ధి కేంద్రాలు



మూతపడ్డ నీటి శుద్ధి కేంద్రం

నర్వ: మండలంలోని ఆయా గ్రామల్లో దాతల సహకారంతో గతంలో చేపట్టిన తాగునీటి శుద్ధి కేంద్రాలు మూతపడినట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కేంద్రాలు నిర్వాహణ కరువై మూతపడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాలు మూతపడడంతో ప్రైవేట్ శుద్ధి కేంద్రాల్లో డబ్బులు అదనంగా చెల్లించి తాగునీటిని తెచ్చుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా వీటిని తిరిగి మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మరికల్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చిన్నరాజమూర్‌లో ఆంజనేయస్వామివారిని దర్శించుకుంటున్న చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతో చిట్టెం పర్ణికారెడ్డి దంపతులు ఆదివారం దేవరకద్రలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామివారికి తొలిసారిగా పూజలు చేశారు. అనంతరం సీవీఆర్ భవన్‌కు చేరుకొని తాతాయ్య స్వర్గీయ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, పీసీసీ సభ్యులు దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం ధన్వాడనుంచి ఇంటింటా ఎన్నికల ప్రచార శంఖరావాన్ని పూరించనున్నట్లు తెలిపారు.

మరికల్: కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డిని గెలిపించాలని పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వీరన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కృష్ణయ్య, రామకృష్ణ, సత్యన్న, మొగులప్ప, ఆంజనేయులు, శేఖర్, హరిష్, చిన్నబాలు, హన్మంతు పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రిగా ప్రకటించడంపై హర్షం



మాట్లాడుతున్న అమర్‌కుమార్ దీక్షిత్

కృష్ణా: రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడంపై బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు అమర్‌కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిపార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, బీజేపీ మాత్రం వారికి అధికారం అందించాలనే ఆకాంక్షతో బీసీ ముఖ్యమంత్రి డిక్లేర్ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని బడుగుబలహీన వర్గాలకు చెందిన ప్రజలు బీజేపీ అండగా ఉండి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు సోమశేఖర్‌గౌడ్, మజ్జిగ సురేష్ ,శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, నల్లె నర్సప్ప, రాఘవేంద్ర, శక్తి సింగ్, డీకే కిష్టప్ప ఉన్నారు.

ప్రతి గడపకు సంక్షేమం.. అదే మా విజయం

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

నర్వ: ప్రతి గడపకు సంక్షేమం.. అదే మా విజయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న పౌల్ట్రీఫాంలో నిర్వహించిన క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ఈ సందర్భంగా మక్తల్ బీఆర్‌ఎస్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా. ఆంజనేయులుగౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కుటంబాన్ని కలిసి బీఆర్‌ఎస్ మెనిఫెస్టోను వివరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షురాలు చిట్టెం సుచరిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములు శెట్టి, జెడ్పీటీసీ గొనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే చిట్టెం అన్నారు. ఆదివారం మండలంలోని తిప్రాస్‌పల్లిలో అసెంబ్లీ ఎన్నికల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గడప, గడపకు వివరించాలన్నారు.సర్పంచ్ సుమంగళ, జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి,అరవింద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..



కండువాలను వేస్తున్న కుంభం శివకుమార్ రెడ్డి

నారాయణపేట: నియోజకవర్గంలోని కోయిలకొండ మండలం మల్కాపూర్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండలంలోని భైరంకొండ వాదిరాజ్, సిద్రాంరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దామరగిద్ద మండలంలోని మద్దేల్‌బీడ్ వార్డు సభ్యులు కిష్టప్ప, క్యాతన్‌పల్లి నుంచి పలువురు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీకండువా వేసి ఆహ్వానించారు.

ఇన్‌చార్జిలే విజయ సారథులు

- ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: బీఆర్‌ఎస్ విజయానికి బూత్‌కమిటీ ఇన్‌చార్జిలే విజయ సారథులని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంజయ్ ఫాం హౌస్‌లో ఏర్పాటుచేసిన బూత్ కమిటీ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు.. కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో పనిచేసి గెలిపిస్తే అండగా ఉంటానన్నారు. అనంతరం ముసాపేట్, దేశాయ్‌పల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుతం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎన్నికల హామీలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని ఓట ర్లను కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్. ఈదప్ప, భీంరెడ్డి, దామోదర్‌రెడ్డి, తిప్పన్న, బస్వరాజ్, బసంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఆవుల కుర్వ సరేందర్

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధికోసం తనవంతు కృషిచేస్తానని నియోజకవర్గ నాయకుడు ఆవుల కుర్వ నరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని జక్లేర్, మక్తల్ కడ్మూర్, అమరచింత, చిన్నకడ్మూర్, ఊట్కూర్, నర్వ గ్రామాల్లో పర్యటించి తమకు ఓటువేసి ఒక్కసారి అవకాశమివ్వాలని ఓటర్లను కోరారు. అనంతరం బీరప్ప ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇతర రాజకీయ నాయకుల పార్టీలు తమకు ఎవరు టిక్కెట్ ఇవ్వరని ఓట్లతో తమ సత్తా ఏమిటో చూయించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం తనవంతు కృషిచేస్తానని చెప్పారు. తమకు ఓటువేసి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు అన్నిరంగాల్లో కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నర్వ మాజీ జెడ్పీటీసీ వెంకటన్న, జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షుడు నాగరాజు, కుర్వ ఆశప్ప, కుర్వ శివ, గజలప్ప, రాములు, యేగెందర్ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని భూనీడ్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద భూగర్భ గనులు, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. వివరాల్లోకి వెళితే మంత్రి, ఎమ్మెల్యే అంసెబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూనీడ్‌లో కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కాంగ్రెస్ కార్యాలయం ముందుగా వెళ్తుండగా.. ఇరు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యతోపులాట చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాల వారిని సర్దిచెప్పి శాంతింపజేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు, కార్యకర్తలను కొట్టారని ఆదివారం ఉదయం మంత్రి, ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను పార్టీ కార్యకర్తలు దహనం చేశారు. రాత్రి జరిగిన సంఘటనపై ఇరు పార్టీల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాగునీటి కుళాయిల వద్ద దుర్గంధం



అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో తాగునీటి కుళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. కుళాయి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు రూ.లక్ష వెచ్చించి ఏర్పాటు చేసిన కుళాయిల పరిస్థితి దయనీయంగా మారింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విషయాన్ని పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లితండ్రులు తెలిపారు. మున్సిపల్ కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఏంటని, అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

